

అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | గురువారం 09 నవంబర్ 2023 | www.navatelangana.com



ఆకాశంలో మబ్బులు..
రైతు గుండెల్లో గుబులు
- ధాన్యం చేతికొచ్చే వేళ రైతులకు ఇక్కట్లు
- జుక్కల్‌లో భారీ వర్షంతో ఆరుతడి పంటలకు నష్టం

8లో...

కాంగ్రెస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం
- టికెట్ కేటాయించకపోవడంతో మనస్థాపంతో పురుగుల మందు తాగిన బాన్సువాడ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్



వార్త మెయిన్ పేజీలో...

ఎన్నికల వేళ తాయిలాలు
- పలువురు సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు కాసులవర్షం
- ఇప్పటి వరకు సగం ముట్టజెత.. నామినేషన్‌ల తర్వాత మరింత ఎక్కువ అందజేసే అవకాశం?



నవతెలంగాణ-రామారెడ్డి

ఎన్నికల వేడి నెలకొన్న నేపథ్యంలో కిందస్థాయి నాయకులకు, పలువురు ప్రజాప్రతినిధులకు తాయిలాలు జోరందుకున్నాయి. తమతమ నాయకులు, ప్రజాప్రతినిధులు తమకు అందుబాటులో ఉండేలా అభ్యర్థులు వారిని 'సర్వం' చూసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పలునియోజకవర్గాల్లోని ఆయా ప్రధాన పార్టీలు తమతమ ప్రజా ప్రతినిధులు చేజారకుండా ఉండేందుకు పలువురికి ఒక్కొక్కరికి రూ.50 వేల నుండి రూ.లక్ష వరకు అందజేస్తున్నట్టు భోగట్ట. గత దసరా ఉత్సవాలకు రూ.5000 అందజేసినట్లు విశ్వాసనీయ సమాచారం. రానున్న దీపావళి పండగకు ప్రజా ప్రతినిధులను, ప్రధాన నాయకులు చేజారకుండా ఉండేందుకు మరెన్నో మార్గాలను ఎంచుకుంటారోనని ప్రజల్లో చర్చనీయాంశం అవుతుంది. తమ గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఎన్నివిధాల ప్రయత్నాలు చేయాలో అన్నివిధాల ప్రయత్నాలు చేస్తున్నారని, ఖర్చుకు భయపడటం లేదని, వెనుకడుగు వేసే ప్రసక్తే లేదనే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తుంది.

కామారెడ్డి బరిలో.. ఉద్దండులు



- కేసీఆర్, రేవంత్‌రెడ్డి పోటీతో కామారెడ్డి వైపు రాష్ట్ర ప్రజల చూపు
- చివరికి గెలిచేది ఎవరు.?
- నేడు కేసీఆర్ నామినేషన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గం నుంచి ఉద్దండులు పోటీ పడుతుంటంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి బరిలో దిగడంతో అందరి చూపు ఈ నియోజకవర్గం మీద పడింది. దీంతో పాటు బీజేపీ అభ్యర్థి అర్బన్ ఏరియాలో పాగా వేసే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కామారెడ్డిలో పోరు రసవత్తరంగా మారింది.

కామారెడ్డి నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బరిలో దిగనున్నట్టు తేలడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. తన సొంత గ్రామం కామారెడ్డి నియోజకవర్గంలో ఉండటంతో తాను కోరడంతోనే కేసీఆర్‌లో బరిలో నిలుస్తున్నట్టు విప్ గంపగోవర్ధన్ పలుమార్లు చెప్పారు. కాగా ఇక్కడి నుంచి పోటీ చేస్తే ఉత్తర తెలంగాణ మీద ఆ ప్రభావం ఉండే అవకాశం ఉందని, దీంతో పాటు మైనార్టీల ఓట్లు సాధించుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడి నుంచి పోటీలో నిలిచినట్టు భోగట్ట. అయితే కేసీఆర్‌పై పోటీకి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సైతం సై అన్నారు. కోడంగల్‌తో పాటు కామారెడ్డి నుంచి సైతం రేవంత్‌రెడ్డి బరిలో నిలిచి కేసీఆర్‌తో తలపడనున్నారు.

సంక్షేమం గట్టెక్కిస్తుందని నమ్మకం..

బీఆర్ఎస్ పార్టీ తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అమలు చేయబోయే పథకాలే తమను గెలిపిస్తాయని బీఆర్ఎస్ నాయకులు నమ్మకంగా చెబుతున్నారు. దీంతో పాటు స్వయంగా కేసీఆర్ బరిలో నిలవడంతో తాము గెలుస్తామని నమ్మకం ఉందని మేజార్టీ కోసమే తాము ప్రచారం చేపడుతున్నట్టు వారు పేర్కొంటున్నారు.

కాగా నాయకుల మధ్య విభేదాలు తెరపైకి వస్తుండటంతో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవల మాచారెడ్డిలో ఇద్దరు ప్రజాప్రతినిధులు దాడి చేసుకోవడం గమనార్హం. కాగా నాయకులను సమన్వయం చేసేందుకు కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి సమావేశం నిర్వహించినా మార్పు రాకపోవడం గమనార్హం.

ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ గురి

తాము ప్రకటిస్తున్న ఆరు పథకాలు తమ పార్టీని గెలిపిస్తాయని నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం, రూ.500కే సిలిండర్, వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు పింఛన్ పెంపు తదితర వాటి ప్రచారంతో ముందుకెళ్తాము గెలుస్తామని నమ్మకంతోనే ప్రచారం చేసుకుంటున్నారు. అయితే షబ్బీర్ లేని లోటు స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది. ఆయన అనుచరులు ఎక్కువగా నిజామాబాద్ అర్బన్‌కే సమయం కేటాయిస్తే.. ఇక్కడ ప్రచారంలో ఆ లోటు కనిపించే అవకాశం ఉంది.

వీరితో పాటు బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి సైతం పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. తన సొంత మ్యానిఫేస్టో ప్రకటించడం గమనార్హం. పట్టణంలో కొంత మేర ప్రభావం చూపనున్నా.. గ్రామీణ ప్రాంతాల్లో అంతలా పట్టు లేనట్టు సమాచారం.

ఏసీబీ వలలో సబ్‌రిజిస్ట్రార్
- బాన్సువాడలో ఏసీబీ దాడులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ సబ్ రిజిస్ట్రార్ ఏసీబీ వలలో పడ్డారు. డాక్యుమెంట్ల కోసం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. బాన్సువాడ డివిజన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బాన్సువాడ పట్టణానికి చెందిన ఉమామహేశ్వర్ తన తండ్రి పేరు పై ఉన్న పాత ఇంటి మ్యుటేషన్ సర్టిఫికెట్ కోసం ముగ్గురు అన్నదమ్ములకు పంపకం చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నందుకై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. ఏదో కారణం చెప్పి ఇందులో ఇబ్బందులు ఉన్నాయని అధికారులు తెలుపగా, ముగ్గురిపై రిజిస్ట్రేషన్ కావాలంటే పదిహేను వేలు ఇవ్వాలంటూ సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. డబ్బులు ఇచ్చుకోలేని పరిస్థితిలో ఉన్నామని, తమ తండ్రి ఆస్తిని తాము రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నామని అందుకు పత్రాలు చూసి రిజిస్ట్రార్ చేయాలని కోరగా 15 వేలు ఇస్తేనే రిజిస్టర్ చేస్తానని సూచించడంతో చేసేది ఏమీ లేక అక్టోబర్ 16న ఉమామహేశ్వర్ ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బుధవారం మధ్యాహ్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా తన వద్ద డబ్బులు లేవని వివరించగా సరే 9 వేలు కచ్చితంగా ఇవ్వాలని ఆదేశించడంతో చేసేదేం లేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది యూనిస్‌కు 9 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సాయంత్రం వరకు కార్యాలయంలో వివిధ సోదాలు నిర్వహించారు.



అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న నగదు

▸ మిగతా 2లో...

జోరుగా నామినేషన్‌లు..
- కామారెడ్డి జిల్లాలో 36, నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 25 నామినేషన్‌లు దాఖలు

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ

ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్‌ల గడువు దగ్గరపడు తున్నా కొద్దీ నామినేషన్‌ల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 నియోజకవర్గాల్లో పెద్దఎత్తున నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. బుధవారం ఏకంగా 61 నామినేషన్‌లు దాఖలు కావడం విశేషం.

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా బుధవారం 36 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కామారెడ్డి నియోజక వర్గంలో ఇద్దరు అభ్యర్థులు రెండు సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేయగా, మరో 12 మంది అభ్యర్థులు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారని ఆయన తెలిపారు. ఎలారెడ్డి నియోజకవర్గం నుండి ఆరుగురు ఒక్కో నామినేషన్ దాఖలు చేశారని అన్నారు. జుక్కల్ నియోజక వర్గం నుండి ఒక అభ్యర్థి 3 నామినేషన్లు, ఇద్దరు అభ్యర్థులు రెండు సెట్ల నామినేషన్లు వేయగా మరో 7 గురు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారని కలెక్టర్ వివరించారు.



రేవంత్‌రెడ్డి తరఫున

▸ మిగతా 2లో...

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలు

- ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ నుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో భాగంగా నిజామాబాద్ జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తో కలిసి కలెక్టర్ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బదలాయింపులకు సంబంధించిన ఫారం-06 , ఫారం-08 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఇంకనూ కొనసాగుతోందని, వాటి పరిష్కారం అనంతరం ఆయా నియోజకవర్గాలలో ఓటర్ల తుది జాబితా ఖరారవుతుందని వెల్లడించారు. అన్ని నిబంధనలను పాటిస్తూ, ఇళ్లకు పోలింగ్ అధికారుల



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

బందాలు వెళ్లి పూర్తి పారదర్శకంగా వీడియో చిత్రీకరణ నడుమ వారి ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తాయని, సీక్రెట్ ఓటింగ్ కోసం ఓటింగ్ కంపార్ట్ మెంట్ ను కూడా ఏర్పాటు చేస్తారని అన్నారు. ఇప్పటివరకు సీనియర్ సిటిజన్లకు సంబంధించి 889 మంది, దివ్యాంగులకు సంబంధించి 858 మంది ఇంటి నుండి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఫారం-12 (డి) సమర్పించారని తెలిపారు. అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే 13 శాఖల ఉద్యోగులకు సైతం పోస్టల్ బ్యాలెట్ వెసులుబాటు కల్పించినట్టు తెలిపారు.

ఓటర్లు 13,89,291

జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలైన నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, బాన్సువాడ, ఆర్మూర్, బాల్కొండ సెగ్మెంట్ల పరిధిలో గల 833 ప్రాంతాలలో మొత్తం 1549 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నవంబర్ 07 నాటికి రూపొందించబడిన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 13,89,291 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లలో 80 సంవత్సరాలు పైబడిన సీనియర్ సిటిజన్లు 17580 మంది ఉండగా, 40 శాతం పైబడి వైకల్యం కలిగిన దివ్యాంగులు 23919 మంది ఉన్నారని, వీరు ఇంటి నుండే ఓటు వేసేందుకు వీలుగా ఫారం-12 (డి) పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు.

తనిఖీలు.. నగదు, మద్యం పట్టివేత

తనిఖీల సందర్భంగా జిల్లాలో ఇప్పటి వరకు రూ. 89,40,799 విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నట్టు కలెక్టర్ తెలిపారు. రూ. 3.80 కోట్ల నగదు, రూ. 78.45 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు తెలిపారు. పట్టుబడిన నగదులో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా పరిశీలన జరిపిన మీదట సరైన ఆధారాలు ఉన్న వారికి రూ. 2.39 కోట్ల నగదును తిరిగి అందజేశాం. రూ. పది లక్షల పైచిలుకు పట్టుబడిన నగదుకు సంబంధించి రూ. 1.04 కోట్ల పైచిలుకు నగదును ఐ.టీ శాఖ అధికారులకు అప్పగించామని తెలిపారు.

బైండోవర్.. బందోబస్తు : సీపీ కల్మేశ్వర్

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, ఎన్నికలను దష్టిలో పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా 260 మంది రౌడీషీట్ కలిగిన వారిని, 41 మంది కమ్యూనల్ రౌడీలను బైండోవర్ చేశామని తెలిపారు. అలాగే 2018, 2019 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కేసులు నమోదైన వారిలో 266 మందిని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసులు నమోదైన 184 మందిని కూడా బైండోవర్ చేశామన్నారు. లైసెన్సులు కలిగిన 69 ఆయుధాలను డిపాజిట్ చేయించామని, బ్యాంకులకు భద్రతా దష్ట్యా 23 తుపాకుల వినియోగానికి మాత్రమే అనుమతించడం జరిగిందన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా 750 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటారని, మరో 9 కంపెనీల కేంద్ర బలగాలను జిల్లాకు కేటాయించారని, వీరిలో ఇప్పటికే మూడు కంపెనీల బలగాలు జిల్లాకు చేరుకున్నాయని సీ.పీ తెలిపారు.

ఏసీబీ వలలో సబ్‌రిజిస్ట్రార్

-మొదటిపేజీ తరువాయి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సబ్‌రిజిస్ట్రార్ పట్టుకు న్నారని సమాచారం తెలియడంతో బాన్సువాడ పట్టణంలో ఉన్న రైటర్లు, బ్రోకర్లు వరి కార్యాలయాలకు తాళాలు వేసి ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారు. సబ్ రిజిస్టర్ సతీష్‌కు సహకరించిన సిబ్బందిపై సబి రిజిస్టర్ పై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు ఈ దాడిలో ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ ఎస్సై లు శ్రీనివాస్, నగేష్, వెంకట్ రావ్ గౌడ్ ఉన్నారు.

శివసేన అభ్యర్థి నామినేషన్ దాఖలు

నవతెలంగాణ-బోధన్

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బుధవారం శివసేన పార్టీ అభ్యర్థి పసులేటి గోపికిషన్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి మోహన్ రెడ్డి తరపున పార్టీ రాష్ట్ర నాయకులు అడ్లూరి శ్రీనివాస్, నర్సింహారెడ్డి 3వ సెట్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థిగా మహమ్మద్ యూసుఫ్ నామినేషన్ వేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజాగౌడ్ నామినేషన్ల స్వీకరించారు.

బీఆర్ఎస్ పార్టీలోకి జోరుగా వలసలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గాం(పి) గ్రామంలో నూడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి నివాసంలో రూరల్ నియోజకవర్గం ఆర్యానగర్ కాలనీకి చెందిన 40 మంది యువకులు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు సయ్యద్ నాభి, చేరిన యువకులు గదరి శ్యామ్ సుందర్ రెడ్డి, హరీష్ కుమార్, కీర్తి వర్ధన్ రెడ్డి, నితీన్‌గౌడ్, విశాల్, మంగల్, లోకేష్, నిఖిల్, నర్సింహా, సాయి, ఈశ్వర్, ఉదయ్, సాయిరాం, నంద కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా నామినేషన్‌లు

-మొదటిపేజీ తరువాయి

కామారెడ్డి నియోజకవర్గంలో రాజ్యాధికార పార్టీ నుండి నరసింహ నరేందర్ రెండు సెట్లు, బిజెపి నుండి కోటిపల్లి వెంకటరమణ రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ నుండి ఊడ్తవార్ సురేష్ గౌడ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి అనుముల రేవంత్ రెడ్డి, అలియాన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ నుండి లింగాల ముత్యం, బహుజన లెఫ్ట్ పార్టీ నుండి సిద్ధిరాములు సిరిగద ఒక్కో నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బొడసు నరసిం హులు, అర్రోళ్ల నరేష్, చిందం మల్లయ్య, నీల నాగరాజు, ఆకుల హరీష్, చెవుల పరశురాములు, దొడ్లే రాజేందర్, బుట్టెమ్ గారి మాధవ రెడ్డి ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారు.

జుక్కల్ నియోజకవర్గంలో.. బీజేపీ అభ్యర్థి టి.అరుణతార మూడు సెట్లు, భారతీయ రాష్ట్ర సమితి నుండి హనుమంత్ షిండే రెండు సెట్లు, బిఆర్ఎస్ నుండి శోభావతి షిండే రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బహుజన్ భారత్ పార్టీ నుండి బాబు ఆర్. ధర్మ సమాజ్ పార్టీ నుండి భూమయ్య పనగంటి వారి, ఇండియా ప్రజాబంధు పార్టీ నుండి గ్గ రాజు, తెలంగాణ రాజ్య సమితి నుండి బొగుడమీద సాయిలు స్వతంత్ర అభ్యర్థులుగా గంగారాం, గైని ప్రేమ్ కుమార్, గైక్వాడ్ ప్రకాష్‌లు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారని కలెక్టర్ తెలిపారు.



ఎల్లారెడ్డి నుంచి నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్

ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి బహుజన సమాజ్ పార్టీ నుండి జమున రాథోడ్, ఆమ్ ఆద్మీ పార్టీ నుండి అమర్ సింగ్ భమన్, ధర్మ సమాజ్ పార్టీ నుండి శామ్ బుగళ్ళ లక్ష్మయ్య , ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి కె. మదన్ మోహన్ రావు తో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా నేనావత్ బాధ్య నాయక్, బంతిలాల్ మాంజ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారని కలెక్టర్ పాటిల్ తెలిపారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 25..

రాష్ట్ర శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ జిల్లా పరిధి లోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి బుధవారం రోజున 25 నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులు తెలిపారు.

ఆర్మూర్ సెగ్మెంట్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నారాయణపేట రాజేష్, బీజేపీ అభ్యర్థిగా పైడి రాకేష్ నామినేషన్లను సమర్పించారు.

బోధన్ సెగ్మెంట్ నుంచి వి.మోహన్ రెడ్డి(బీజేపీ), పి.గోపి కిషన్(శివసేన), ఎండి. యూసుఫ్ (స్వతంత్ర), సయ్యద్ అస్గర్ (స్వతంత్ర), పి.రజితవాణి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), మోసిన్ (ఎం-సీపీఐ) నామినేషన్‌లు దాఖలు చేశారు.

బాన్సువాడ సెగ్మెంట్ నుండి కూనింటి రామ్ (స్వతంత్ర), కాసుల రోహిత్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), కాసుల బాలరాజ్ (కాంగ్రెస్), యెండల లక్ష్మీనారాయణ (బీజేపీ), డి.సుభాష్ (స్వతంత్ర), షేక్ గౌస్ (స్వతంత్ర), గోపాల్ (ఎం-సీపీఐ), తోట శ్రీకాంత్(ధర్మ సమాజ్ పార్టీ) నామినేషన్లు దాఖలు చేశారు.

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి మౌలానా ఖాన్ (స్వతంత్ర), ఎండి.జహీరుద్దీన్ (ఎంబీటీ), లక్క అశోక్ (ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ), ధన్ పాల్ సూర్యనారాయణ (బీజేపీ), ఫజల్ క్రీం (కాంగ్రెస్) నామినేషన్లను దాఖలు చేశారు.

నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ నుండి గుగులోత్ బాలరాజు (స్వతంత్ర), బీ.బీ.నాయక్ (స్వతంత్ర) అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారు. బాల్కొండ నియోజకవర్గం నుండి ఏలేటి అన్నపూర్ణ (బీజేపీ), పల్లికొండ నర్సయ్య (బీఎస్పీ) అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. కాగా, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయిన నాటి నుండి ఇప్పటివరకు నిజామాబాద్ జిల్లాలో మొత్తం 62 నామినేషన్లు దాఖలయ్యాయి.

మైనార్టీ మోర్చా మండలాధ్యక్షులుగా ముజీబ్‌ఖాన్

నవతెలంగాణ-రెంజల్

మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడుగా ముజీబ్ ఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు బిజెపి మండల అధ్యక్షులు గోపికృష్ణ పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా ముదాసీర్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే రహమత్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు.

రక్తదానం చేద్దాం

- తలసేమియా బాధితులను ఆదుకుందాం
- రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా బాధితులను ఆదుకోవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని రెడ్‌క్రాస్ ఆవరణంలో రెడ్‌క్రాస్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో 200 మందికి మించి తలసేమియాతో బాధపడుతున్నారని అన్నారు. అయితే తలసేమియా బాధితుల ఆరోగ్య రక్షణకు తరుచుగా రక్తం అవసరమని ఇప్పుడు రక్త కొరత ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో రక్త దానం చేసి వారి ప్రాణాలు కాపాడల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, కాలేజీ యాజమాన్యాలు స్వచ్ఛందంగా రక్త శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డొల్ల రాజేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, ఈ.సి సభ్యులు సూర్యనారాయణ, ఎం.సి సభ్యులు డా.నీలిరాంచందర్, నిజామాబాద్ డివిజన్ చైర్మన్ డా.శ్రీశైలం, యూత్ రెడ్‌క్రాస్ సమన్వయ కర్త మాణిక్యాల శ్రీనివాస్ రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్

11న ఛలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

ఈ నెల 11న చలో హైదరాబాద్ విశ్వరూపం మహాసభకు తరలిరావాలని నీలా గ్రామంలో బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి మాటాడుతూ.. శీతాకాల సమావేశాలలో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు 11న హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న విశ్వరూప మహాసభకు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బండారి రాజేందర్, బండారి సాయిలు, బండారి రవి, బండారి ఎల్లప్ప, బండారి మోహన్, బండారి శ్రీనివాస్, బండారి లాలు, బండారి నరసన్న, బండారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న సిద్దరాణి

నవతెలంగాణ-పొతంగల్

మండలంలో అరిషా ఫాతిమాకు కల్యాణలక్ష్మి చెక్కును గ్రామ పంచాయతీలో సిబ్బంది వి.సిద్దరాణి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి యాదవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్/జక్రాన్‌పల్లి

పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిజామాబాద్ కాంగ్రెస్ భవన్ నందు యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్‌యుఐ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ చిన్న కార్యకర్త స్థాయి నుండి ఎంతో కృషితో కష్టపడి పనిచేస్తూ అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి అయ్యారని, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అండగా ఉంటూ ధైర్యాన్ని నింపిన నాయకుడని అన్నారు. నవంబర్ 30వ తేదీలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాదిస్తుందని వారు అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామర్తి గోపి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు ప్రీతం, కార్పొరేటర్ గడుగు రోహిత్, నరాల నిహాల్, చింటూ, శోభన్, ఆవీణ్, వహీద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్‌యుఐ నాయకుల ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

జక్రాన్‌పల్లి :

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి బర్త్ డేను కాంగ్రెస్ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిన్నారెడ్డి, బంగ్లా వసంతరావు, గన్న శ్రీనివాస్, కాట్పల్లి నర్సారెడ్డి, సైకిల్ అక్బర్, శంకర్ బెంజిమెన్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీలాలో కాంగ్రెస్ గడపగడపకు ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలో కాం గ్రెస్ పార్టీ నాయకులు బుధవారం గడపగడవ కు ప్రచారాన్ని నిర్వహిం చి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని వారు కోరారు. ఇందిరమ్మ కాలనీలో గడపగడపకు ప్రచార నిర్వహించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గంగాకృష్ణ, బిసి సెల్ మండల అధ్యక్షులు గోసుల గంగాకిషన్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎల్ రాజు, గ్రామ అధ్యక్షులు సోక్కుల సాయిలు, మార వెంకటేష్, శభాజ్, వహీదుద్దీన్, మునీర్, అలీముద్దీన్, మహమ్మద్, రామ్ చందర్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పలువురు చేరిక

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని సారంగాపూర్ గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు 100 కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో మండల అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో, కంజర్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యం లో 22 మంది యువకులు కాంగ్రెస్ బీజేపీ పార్టీలనుండి స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

- సాదరంగా ఆహ్వానించిన మంత్రి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. బుధవారం వేల్పూర్‌లోని స్వగృహంలో మంత్రి వేముల సమక్షంలో పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వేల్పూర్ మండలంలో బిజెపి నుండి లక్కోర మాజీ ఎంపిటిసి గోవర్ధన్ గౌడ్, బైరి సుధాకర్, అమీనాపూర్ శ్రీనివాస్ కార్యకర్తలు, జానకంపేట్ గ్రామం కాంగ్రెస్ నుండి అనంతరావు, సంతోష్, ప్రిన్స్, వంశీ, కార్యకర్తలు, మోర్తాడ్ మండలం సుంకేట్ గ్రామం నుండి బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పిట్ల బాలకిషన్, పిట్ల గణేష్, దొంకంటి దినేష్, భీంగల్ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన గొల్ల మహేష్, కార్యకర్తలు బిజెపి నుండి పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి మంత్రి ప్రశాంత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు చేరిక

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు చేరిక

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని బోదేపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గంగాధర్, బిజెపి సీనియర్ నాయకులు బాపురెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పుణ్యరాజ్, సునీల్, సాగర్, మల్లయ్య మరో 50 మంది బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సునీల్ కుమార్ వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రజలలోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి హాకీ బాలికల క్రీడాకారుల ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్

67వ ఎస్‌జిఎఫ్ జిల్లా అండర్ 17 హాకీ బాలికల క్రీడాకారులు ఎంపికను ఆర్మూర్‌లోని మినీ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సంగీతరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నిర్వహించే కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల సెలక్షన్స్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఎంపిక కార్యక్రమానికి వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు టీ.విద్యాసాగర్‌రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎంపికలను ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్, జిల్లా హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి సురేందర్, హాకీ సంఘం సభ్యులు నాగేష్, బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, వ్యాయామ ఉపాధ్యాయులు భూపతి, సీనియర్ క్రీడాకారులు నవనీత్, కత్తి శ్రీనివాస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన హాకీ బాలికల క్రీడాకారులు

c
m
y
k

అభివృద్ధికి అండగా ఉండండి

- ఏం చేశారని కాంగ్రెస్ వాళ్లు ఓట్లడుగుతున్నారు
- రుణమాఫీ ఆగే ప్రసక్తే లేదు
- కమ్మర్‌పల్లి మండలంలో మంత్రి వేముల ప్రచారం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బీఆర్ఎస్ కంటే ముందు యాభై ఏండ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు గిరిజనులకు పోడు పట్టాలు ఎందుకు ఇవ్వలేకపోయాయని, వారికి పోడు పట్టాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి, బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు ఎన్నికలు రాగానే ప్రతిపక్షాలు ఓట్ల రాజకీయపు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. బుధవారం బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్, ఇనాయత్‌నగర్, నర్సాపూర్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో మహిళలు బోనాలతో సాదర స్వాగతం పలుకగా గిరిజన మహిళలు లంబాడా నృత్యాలతో, వలగొడుగులు, డప్పుల దరువులతో మంత్రికి అఖండ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు పంట పెట్టుబడి సాయం, పేదలకు ఆసరా పింఛన్లు, రైతుబీమా, ఆడబిడ్డ పెండ్లికి కళ్యాణలక్ష్మీ తదితర మానవీయ పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భాస్కర్ యాదవ్, కొత్తూరు లక్ష్మారెడ్డి, జెడ్పీటీసి రాధ, ఎంపిపి గౌతమి, మండల, గ్రామ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి వేముల

పత్రీజీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

సుభాష్ పత్రీజీ జన్మదిన వేడుకలను డివిజన్‌తో పాటు పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 8వ రోజు మోర్తాడ్ మండల కేంద్రంలో శ్రీ గురుడు అమృత్ రావు, జైడి గంగాధర్, రవి, రమేష్ మాస్టర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్టు సభ్యులు శ్రీ దామోదర్‌రెడ్డి, పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు నల్ల గంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయికృష్ణరెడ్డి, సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ నీలిమా, ముఖ్య సలహాదారులు బొడ్డు దయానంద్ పాల్గొన్నారు. ధ్యానం వల్ల కలిగే ఉపయోగాలను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో గోవింద్‌పేట్ మిట్టపల్లి గంగారెడ్డి, చింతలూరు మాజీ సర్పంచ్ సంతోష్, సతీష్, కొత్తపల్లి రాజిరెడ్డి, కిష్టయ్య, ఇస్సపల్లి రాజు, గొల్ల మల్లయ్య, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న పలువురు

సొంతగూటికి జక్క రాజేశ్వర్

నవతెలంగాణ-ముప్కాల్

ఉమ్మడి బాల్కొండ మాజీ ఎంపీపీ, ప్రస్తుత వేంపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ జక్క రాజేశ్వర్ బుధవారం కాంగ్రెస్ పార్టీ సొంత గూటికి చేరారు. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో చేరారు. జక్క రాజేశ్వర్ బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకుని వేంపల్లి సొసైటీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం వేంపల్లి సొసైటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. బాల్కొండ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. జక్క రాజేశ్వర్‌కు సునీల్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, ముప్కాల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యం రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుమో రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటికి బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్ అధ్వర్యంలో బుధవారం గ్రామంలోని శ్రీవెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఈసారి నూతనంగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టే పథకాలను ప్రజలకు, మహిళలకు వివరించారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గత పదేళ్లుగా రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నారని తెలిపారు. కారు గుర్తుకే ఓటు వేసి రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలి పించాలని వారు కోరారు. కార్యక్రమంలో యూత్ నాయకులు క్రాంతి కుమార్, షేక్ సద్దాం, ఇమ్రాన్ ఖురేషి, నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కాంగ్రెస్ వస్తే 24 గంటల కరెంట్ ఇవ్వదు

- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లి, అర్గుల్, నారాయణపేట్, లక్ష్మాపూర్, నల్లగుట్ట, భూమితండా, మునిపెల్లి గ్రామాల్లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి మరోసారి అవకాశం ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, ధర్పల్లి జెడ్పీటీసి బాజిరెడ్డి జగన్, ఎంపీపీ కుంచాల విమల రాజు, జడ్పీటీసి తనూజ శ్రీనివాస్‌రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామంలో గుత్ప ఎత్తిపోతల నీటిని పైపుల ద్వారా నీరు అందిస్తానని 2018 ఎన్నికల్లో హామీనిచ్చారని, లిఫ్ట్ ద్వారా నీరు అందించకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేయమని రైతులు ప్రశ్నించారు. గెలిపిస్తే ఆరు నెలల్లో గ్రామానికి లిఫ్ట్ ద్వారా నీళ్ల అందిస్తారని హామీ ఇచ్చారు.


ప్రచారంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

కేజీబీవీ పాఠశాలను సందర్శించిన డీఇఓ

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.దుర్గప్రసాద్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, హాజరు పట్టికలను, విద్యార్థినిలు హాజరుశాతాన్ని పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థినీల కోసం ప్రత్యేక ప్రణాళికను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ప్రత్యేక ప్రణాళిక, పనితీరును గమనించి, వెనుకబడిన విద్యార్థినిల కోసం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. కళాశాల, పదవ తరగతిలో అందరు విద్యార్థినీలు ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిని ప్రగతి ఉన్నారు.


పాఠశాలను సందర్శిస్తున్న డీఈవో

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యారంగాన్ని, ఉపాధిరంగాన్ని నిర్లక్ష్యం చేసిన బిఆర్ఎస్, బిజెపి పార్టీలను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని పి.డి.ఎస్.యూ డివిజన్ ఆధ్యక్షులు ప్రిన్స్, పి.వై.ఎల్ ఆధ్యక్షులు ఎస్.వెంకటేష్ విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలోని పిడిఎస్యూ కార్యాలయంలో బుధవారం స్టూడెంట్ యూత్ మేనిఫెస్టోను పి.డి.ఎస్.యూ, పి.వై.ఎల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమాజం సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందాలంటే, అసమానతలు తొలగాలంటే విద్య, వైద్యం ఉపాధి కీలకమైనవని అన్నారు. కానీ పదేండ్ల కాలంలో బీఆర్ఎస్, బిజెపి పార్టీలు ఈ రంగాలను గాలికి వదిలేశాయని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రీజియన్‌లో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలో చేసిన పని విధానాన్ని గుర్తించి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కె.జానీరెడ్డి ఆధ్వర్యంలో అవార్డు పురస్కారాలు నిర్వహించారు. నిజామాబాద్ రీజియన్‌లోని నిజామాబాద్ 2 డిపోలో 'ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాల'ను అందజేశారు. అందులోను 'రీజియన్ లెవెల్ క్వార్టర్లీ అవార్డు'లను డ్రైవర్ విభాగంలో 10, కండక్టర్స్ విభాగంలో 7, టీమ్స్ డ్రైవర్ విభాగంలో 3, పిహెచ్చి డ్రైవర్ విభాగంలో 5, అర్టిషియన్ మెకానిక్‌లు 2, శ్రమిక్స్‌లో ఒకరిని, బెస్ట్ బస్టాండ్‌లో 1ని ఎంపిక చేసి రీజియన్ మేనేజర్ చేతుల మీదుగా శాలువాలు కప్పి ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, డ్రైవర్, కండక్టర్‌లు పాల్గొన్నారు.


పురస్కారాలు అందజేస్తున్న మేనేజర్

ఓడిన నువ్వా.. మాట్లాడేది

- ఎమ్మెల్సీ కవితపై షబ్బీర్‌అలీ ఫైర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సీఎం కూతురు అయి ఉండి 70,000 ఓట్లతో చిత్తుగా ఓడిపోయిన నువ్వా... నా గురించి మాట్లాడేది?' అంటూ ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ నిజామాబాద్ అర్బన్ అభ్యర్థి షబ్బీర్ అలీ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ అర్బన్‌లో అవినీతి కమీషన్ నాయకులు గణేష్ గుప్తా, లిక్కర్ రాణి కవిత, ఎం.ఎల్.ఏ. తమ్ముడు షాడో ఎమ్మెల్యే, మేయర్ మరో ఎం.ఎల్.ఎ.గా వ్యవహరిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. అర్బన్ ఎమ్మెల్యే 30 శాతం కమీషన్, పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు భూ కబ్జాలు, గుట్కా దందాలు, బెల్ట్ షాపులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో ఎవరు వెంచర్ చేసినా పార్టనర్ షిప్ ఇవ్వాలని, లేకుంటే అనుమతి ఇవ్వకుండా వేధింపులు చేశారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్నానని చెప్పున్న ఎమ్మెల్సీ కవిత పట్టణంలో ఒక మహిళ ఇంజనీరింగ్ కాలేజీ తేలేదని, ఒక మహిళా డిగ్రీ కాలేజీ తేలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, పట్టణ అధ్యక్షులు కేశ వేణు, తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, రామకృష్ణ, రత్నాకర్, గడుగు రోహిత్, భక్తవత్సలం, దయాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ అర్బన్ అభ్యర్థి షబ్బీర్ అలీ

విద్యార్థులపై భారాన్ని మోపొద్దు

- ఎస్ఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులపై భారాన్ని మోపొద్దని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి హాస్టల్ డిపాజిట్లను తగ్గించాలని ఎస్ఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్ డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ మహేందర్ రెడ్డి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎస్ఎఫ్ఐ-ఎమ్మెస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. ఒకేసారి హాస్టల్ విద్యార్థులపైన డిపాజిట్లను పెంచడం వల్ల విద్యార్థులు హాస్టల్, విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాంతోపాటుగా తెలంగాణ యూనివర్సిటీలో చదువుకునే విద్యార్థులంతా ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనారిటీ విద్యార్థులే అధికశాతం ఉన్నారని వారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ ఎమ్మెస్ఎఫ్ అధ్యక్షులు దినేష్, ఉపాధ్యక్షులు వెంకట్ రమణ, ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు దినేష్, సహాయ కార్యదర్శి చరణ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-కోటగిరి/డిచ్‌పల్లి

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీకి చెందిన పలువురు యువకులు బుధవారం బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి గృహంలో బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. కొత్తపల్లి గ్రామ అధ్యక్షులు సుదర్శన్ ఆధ్వర్యంలో వారందరూ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న కృషికి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరారని పేర్కొన్నారు. వారి వెంట పోచారం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మహిళ కార్యకర్తలు

డిచ్‌పల్లి : మండలంలోని దూస్‌గాం గ్రామానికి చెందిన సుమారు 50 మంది బీజేపీ మహిళ కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మూడవ సారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మహిళ విభాగం అధ్యక్షురాలు పుప్పాల గీత, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, కార్యదర్శి బుచ్చమ్మ, సవిత, యశోద తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీలో అర్బన్ టికెట్ విషయంలో ఎవరికి వారే పోటాపోటీగా, నేనంటే నేను అనే విధంగా అందరూ టికెట్ ఆశించినవారే, కానీ అధిష్టానం అందర్నీ సమన్వయం చేసి, చివరికి కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన షబ్బీర్ అలీకి నిజామాబాద్ అర్బన్ టికెట్ కన్ఫర్మేషన్ చేయడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఒక తాటిపైకి వచ్చారు. దీంతో నిజాంబాద్ లో మరింత బలం పెరిగి



గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు పలు కారణాలతో వేరే పార్టీలోకి వెళ్లినప్పటికీ మళ్లీ తమ సొంత గూటికి పయనం అవుతున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ లో గతంలో పనిచేసిన యువనేత పంచ రెడ్డి చరణ్ ఎన్ఎస్‌యూఐ, విద్యార్థి సంఘం, తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థి నాయకుడిగా పనిచేశారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలందించారు. ఇప్పుడు షబ్బీర్ అలీ రాకతో మళ్లీ సంతగూటికి చేరే అవకాశాలు ఉన్నాయి, గతంలో టీఆర్ఎస్ పార్టీ లోకి వెళ్లినప్పటికీ గత నాలుగు సంవత్సరాలుగా ఏరోజు అయినను బీఆర్ఎస్ పార్టీ కార్యాకలపలలో పాల్గొనలేదు, ఆయనతోపాటు ఆయన సన్నిహితులు, మిత్రులు అందరూ కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమయ్యారు. దాంతోపాటుగా మైనార్టీ నాయకులు ముజాహిద్ ఖాన్, మాజీ కార్పొరేటర్ అజ్జు, వాహిద్, అజీమ్ లతో పాటు మాజీ డిప్యూటీ మేయర్ ఫయుమ్, ఇతరత్రా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునే ముహూర్తం ఖరారు చేసుకున్నట్లే. ఈ రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ లోకి ఇతర పార్టీలో ఉన్న నాయకులు సిద్ధమవుతున్నారని సమాచారం.

బీఎల్ఎఫ్ బాల్కొండ అభ్యర్థిగా అబ్బగోని అశోక్ గౌడ్

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థిగా అబ్బగోని అశోక్‌గౌడ్‌కు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పార్టీ బీఫామ్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఎల్ఎఫ్ (బహుజన లెఫ్ట్ ఫ్రంట్) పార్టీ ఆఫీస్ నందు బిఎల్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ అందజేశారు.

క్రీడాకారుడికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన సోఫెన్ ఈక్బాల్ అండర్-19 నేషనల్ రెస్లింగ్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో ఆయన్ను కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కోలా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నామినేషన్లు దాఖలు

నవతెలంగాణ-భీంగల్

బాల్కొండ నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసేందుకు గాను బుధవారం మూడు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ చిత్రమిశ్రా తెలిపారు. బీజేపీ పార్టీ నుండి ఏలేటి అన్నపూర్ణమ్మ రెండు సెట్లు, బీఎస్పీ నుండి పల్లికొండ నర్సయ్య ఒకసెట్ నామినేషన్ సెట్ దాఖలు చేశారు. ఈనెల 6న కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎస్పీల నుంచి ఒక్కోటి చొప్పున నామినేషన్లు దాఖలు అయ్యాయి.

టీయూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రతిభ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గుజరాత్ రాష్ట్రంలోని గోద్రాలో కళా శ్రీ గోవింద్ గురు యూనివర్సిటీలో ఈనెల 1వ నుంచి 8 వరకు నిర్వహిస్తున్న జాతీయ సమైక్య శిబిరంలో తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రతిభ పాటవాలు ప్రదర్శించారని యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ కే రవీంద రెడ్డి బుధవారం తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు ప్రదర్శించిన బంజారా సాంప్రదాయ నాట్యానికి సంస్కృతిక కార్యక్రమాలలో ద్వితీయ బహుమతి పొందారు. స్వాగత కార్యక్రమంలో కార్తీక్ నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ నుండి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భావి భారత దేశం-యువత పాత్ర, మానవ వనరుల వినియోగం, పర్యావరణం వంటి అంశాలపై ఉపన్యసించారు. ఈ కార్యక్రమం వలన విద్యార్థుల్లో జాతీయ భావం భిన్నత్వంలో ఏకత్వం భారతీయ కళలు, భాష, సాంప్రదాయాలపై స్పష్టమైన అవగాహన ఏర్పడిందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సరిత తెలిపారు. కార్యక్రమంలో శ్రీ కుబేర్ డెండోర్, విద్యాశాఖ మంత్రి ఆచార్య ప్రతాప్ సిన్హా చోహన్, వైస్ ఛాన్సలర్ (జిజియు) పాల్గొన్నారు.

అండగా ఉంటాం

- జడ్పీటీసి బాజిరెడ్డి జగన్ మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎలాంటి ఆందోళన వద్దని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధర్పల్లి జడ్పీటీసి బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు. బుధవారం ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్‌లో ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రఘునథన్ రామును, ఇతర నాయకులను పరామర్శించి కొండంత ధైర్యాన్ని ఇచ్చారు. గత వారం ఉప సర్పంచ్ రఘునాథన్ రాము తల్లి మృతి చెందారు. దానిలో భాగంగానే గ్రామాన్ని సందర్శించి పలువురిని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండ లంలోని రాజ రాజేశ్వరినగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మల్లేష్, నటరాజ్, ప్రశాంత్ మరో 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం మోర్తాడ్‌లోని ప్రజా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముత్యాల సునీల్ కుమార్ గెలుపులో భాగస్వామ్యం కావడానికి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. అనంతరం ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సబ్బండ కులాలను ఆదుకుంటుందని, కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు అందరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకరి విజయ్ కుమార్, కొమ్ముల రవీందర్, ఎనుగందుల శైలేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌ను ఆదరించండి..

భూపతిరెడ్డిని గెలిపించండి

నవతెలంగాణ-మోపాల్

కాంగ్రెస్‌ని ఆదరించి.. భూపతిరెడ్డిని గెలిపించాలని కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు కోరారు. మండలంలోని వివిధ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మోపాల్ మండల అధ్యక్షుడు సాయి రెడ్డి తదితర కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత్ జాగృతి గ్రామ కమిటీల నియామకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ డిచ్‌పల్లి మండల గ్రామ కమిటీల నియామకాన్ని వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదేశానుసారం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీనాచారి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అవంతిరావు సూచనల మేరకు ఏర్పాటు చేశారు. బర్ధిపూర్ కన్వీనర్ శ్రీనివాస్, కోకన్వీనర్ ప్రణయ్ కుమార్, ముల్లంగి కన్వీనర్ జీవన్‌రెడ్డి, కోకన్వీనర్ గంగారెడ్డి, సాంపల్లి కన్వీనర్ రాజు, కో కన్వీనర్ గంగాధర్, దూసుగాం కన్వీనర్ రవి గౌడ్, కో కన్వీనర్ గంగారెడ్డి, రాంపూర్ కన్వీనర్ నితిన్, కో కన్వీనర్ తోట రాజేందర్‌ను నియమించారు.

నేడు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు డిచ్‌పల్లి, ఇందల్‌వాయి బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చింతా శ్రీనివాస్‌రెడ్డి, చిలువేరి దాస్ బుధవారం తెలిపారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, సహకార సొసైటీ చైర్మన్లు, పార్టీ నాయకులు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నివాసానికి తరలిరావాలని కోరారు.

c
m
y
k

బీఎస్పీతోనే ప్రజల జీవితాల్లో మార్పులు



ప్రచారం నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-బోధన్

బీఎస్పీ పార్టీ అధికారంలో వస్తే ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయని బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి అమర్ నాథ్ బాబు అన్నారు. బుధవారం ఆయన బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో చిరు వ్యాపారుల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్‌లో బీఎస్పీ పార్టీ అభ్యర్థి అయిన తనకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట అసెంబ్లీ ఇంచార్జి పాండు, రామకృష్ణ, సాయిలు తదితరులు ఉన్నారు.

బాధితునికి సెల్ ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఏఎస్సై శంకర్

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగపూర్ గ్రామానికి చెందిన మహిపాల్ రెడ్డి తన మొబైల్ ఫోన్ నెల క్రితం పోగొట్టుకున్నాడు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సిఈఐఆర్ సిస్టం ద్వారా సెల్ ఫోన్‌ను గుర్తించి బుధవారం బాధితుడు మహిపాల్ రెడ్డికి అందజేసినట్లు బాల్కొండ ఏఎస్సై శంకర్ తెలిపారు.

గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూరు గ్రామంలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వెళ్లి ఆరు గ్యారెంటీ స్కీంల గురించి పూర్తిగా వివరిస్తూ నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భూపతిరెడ్డి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు చిన్నారెడ్డి, మునిపల్లి సర్పంచి చిన్న సాయిరెడ్డి, బంగ్లా వసంతరావు, కాటిపల్లి నర్సారెడ్డి, గన్న శ్రీనివాస్, సుంకర శ్రీనివాస్, సుంకరి బెంజిమెన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-బాల్కొండ

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని చిట్టాపూర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసు సిబ్బంది విస్తృతంగా వాహనాలు తనిఖీలు బుధవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమంగా డబ్బులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. 50 వేల రూపాయల కంటే నగదు ఎక్కువగా ఉంటే ఆధారాలు చూపాలని పోలీసు సిబ్బంది అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలీస్ శాఖకు వాహనదారులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు. తనిఖీలలో సూపరింటెండెంట్ సిహెచ్ లింగన్న, సిబ్బంది పి.విగ్నేష్, ఎన్.వసంత్, ఎం.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్మూర్‌కు కేటీఆర్ రాక

● **భారీ ర్యాలీ**

నవతెలంగాణ-ఆర్మూర్



ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆర్మూర్ నుంచి ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ దిశగా దూసుకుపోతున్న జీవన్‌రెడ్డి ముచ్చటగా మూడోసారి వేస్తున్న నామినేషన్ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పాల్గొననున్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు జిల్లా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నేతలు జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. కాగా జీవన్‌రెడ్డి నామినేషన్ ఘట్టాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశాయి. 50వేల మందితో ర్యాలీ జరపడానికి సన్నాహాలు చేస్తున్నారు. పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. జీవన్‌రెడ్డికి మద్దతుగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. ముఖ్యంగా పలు సంక్షేమ పథకాల లబ్దిదారులు జీవన్‌రెడ్డికి మద్దతుగా కదం తొక్కుతున్నారు. ఇదిలావుండగా జీవన్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనడానికి మంత్రి కేటీఆర్ గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు పట్టణానికి చేరుకుంటారు. అనంతరం ఆలూర్ బైపాస్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ ర్యాలీనుద్దేశించి ప్రసంగిస్తారు. తరువాత ఆలూరు బైపాస్ రోడ్ నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు 50వేల మందితో ర్యాలీ చేపట్టనున్నారు.

యూజీ, పీజీ పరీక్ష ఫీజుల పెంపు ఆలోచనను విరమించుకోవాలి

● **పీడీఎస్‌యూ డిమాండ్**

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గల డిగ్రీ, పీజీ పరీక్ష ఫీజుల పెంపు ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు జి.సురేష్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గల అన్ని ప్రభుత్వ ప్రైవేటు, డిగ్రీ, పీజీ కళాశాలలకు సంబంధించి పరీక్ష రుసుములను పెంచవద్దన్నారు. ఇప్పటికే విద్యార్థులకు సరిపడా వసతి సౌకర్యం లేకపోవడం, ఆర్థిక ఇబ్బందుల వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. యూనివర్సిటీ బయోమెట్రిక్ ఫీజులంటు, కాలేజ్ డెవలప్మెంట్ ఫీజులంటూ, స్పెషల్ ఫీజులంటూ విద్యార్థుల నుండి రుసుములు వసూలు చేయడం ఆపివేయాలన్నారు. ఇప్పటికే కోర్స్ ఫీజులకు సరిపడా ఫీజు రియంబర్స్‌మెంట్ రాక అనేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు, ఈ అదనపు ఫీజుల పేరుతో యూనివర్సిటీ అధికారులు ప్రైవేట్ యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. కొత్తగా పరీక్ష ఫీజుల పెంపు ఆలోచన చేయడం బాధాకరమన్నారు. పరీక్ష ఫీజుల పెంపు ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అందుబాటులో లేకపోవడంతో, నాయకులు ఫోన్లో సంప్రదించగా పరీక్ష ఫీజులను పెంచబోమని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అశూర్, సహాయ కార్యదర్శి అజయ్, కోశాధికారి నిఖిల్, నాయకులు రాజేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలో మట్టి చదును పనులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అశోక్

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ఉన్న కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానంలో నర్సరీలో మట్టిని చదును చేసే పనులను బుధవారం ప్రారంభించారు. స్థానిక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నర్సరీలో మొక్కల పెంపకం కోసం భూమిని సిద్ధం చేయడంలో భాగంగా ట్రాక్టర్‌తో మట్టిని చదును చేస్తున్నారు. నర్సరీలో మట్టిని చదును చేస్తున్న పనులను సర్పంచ్ సక్కరం అశోక్ సందర్శించి పరిశీలించారు. హరితహారంలో భాగంగా మొక్కలను నాటేందుకు కావాల్సిన మొక్కలను సిద్ధం చేసేందుకు ఏర్పాటు చేసే నర్సరీ పనులు చురుగ్గా కొనసాగుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-బోధన్



సాలూరలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సాలూర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం పోటాపోటీగా ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. సాలూర బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మున్సిపల్ చైర్మన్ తూము పద్మ ప్రారంభించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ప్రచారం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ అల్లె లావణ్య, శారద, రమేష్, కౌన్సిలర్ శరత్ రెడ్డి, గంగాశంకర్, నాగరాజు, గోవిందగౌడ్, రాహుల లక్ష్మణ్, నాగేశ్వర్ రావు, శ్రీనివాస రావు పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ బుద్దె సావిత్రి ఆధ్వర్యంలో..

సాలూర మండల కేంద్రంలో ఎంపీపీ బుద్దె సావిత్రి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సాయినగర్ కాలనీ, ఎస్సీ కాలనీ, ఫతేపూర్ గ్రామంలో ఈ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్, మండల పార్టీ అధ్యక్షులు నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ షకీల్, సొసైటీ చైర్మన్ జనార్దన్, సరిదే సాయిలు, ఎంపీటీసీ సవిత నాయకులు చందూర్ సాయిరెడ్డి, మౌలా తదితరులు పాల్గొన్నారు.

10న విజయ్ హై స్కూల్ 42వ టాలెంట్ షో

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని విజయ్ హైస్కూల్ 42వ టాలెంట్ షో శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్టు విజయ్ విద్యాసంస్థల అధినేత్రి డాక్టర్ అమృత లత బుధవారం తెలిపారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటి రాజశ్రీ హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని అంకాపూర్ గ్రామ లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు గడ్డం రాజారెడ్డికి ఆత్మీయ సన్మాన కార్యక్రమం సైతం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

డివిజన్‌లలో బీఆర్ఎస్ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ బిగాల గెలుపు కోసం నిజామాబాద్ నగరంలో బి.ఆర్.ఎస్ పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలు, నాయకులు ప్రచారం బుధవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బి.ఆర్.ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే గణేష్ బిగాల నాయకత్వంలో నిజామాబాద్ నగరం జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి కారుగుర్తుకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఆలూర్ రోడ్డు వద్ద నగదు



నగదు పట్టుకున్న పోలీసులు

పట్టివేత

నవతెలంగాణ-ఆర్మూర్

నూతన ఆలూరు మండలం కేంద్రం నుంచి గుత్ప ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం వాహనం

నేను లోకల్.. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

- బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను కలిసేందుకు నిజామాబాద్, సంగారెడ్డి వెళ్లాలి..
- ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌షిండే

నవతెలంగాణ-నిజాంసాగర్

'నేను లోకల్. మీ బిడ్డను. బీజేపీ వాళ్లు నిజామాబాద్ నుంచి ఒక అభ్యర్థి తీసుకొని వచ్చి ఇక్కడ నిలబెటారు. కాంగ్రెస్ వాళ్ళు సంగారెడ్డి నుండి అభ్యర్థిని తీసుకొచ్చారు. తనను గెలిపిస్తే తాను జుక్కల్‌లో లేదా బిచ్కుందలో అందుబాటులో ఉంటా. కానీ వాళ్ళని గెలిపిస్తే ఏదైనా అవసరం ఉంటే నిజామాబాద్, లేదా సంగారెడ్డికి వెళ్లాల్సి వస్తుందని' బీఆర్ఎస్ జుక్కల్ అభ్యర్థి హన్మంత్‌షిండే అన్నారు. రెండు రోజుల ప్రచారంలో భాగంగా మహ్మద్‌నగర్ మండలంలోని హాసన్‌పల్లి, నర్వ, గున్కుల్, బురుగుపల్లి, తుంకిపల్లి గ్రామాలలో బుధవారం జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రతి ఒక్కరు కూడా ఆర్థికంగా బాగుండాలని ప్రతి ఒక్కరి పైన కెసిఆర్ బీమా అని పథకం ప్రవేశపెట్టారని ఆయన అన్నారు. ఇప్పటివరకు కేవలం పంట పొలం పట్ట ఉన్నవారు మరణిస్తేనే రూ.5లక్షలు వచ్చేవని, కానీ ఇప్పుడు ఏ ఒక్క సాధారణ మానవుడు మరణించినా వారికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందించడానికి కేసీఆర్ మానిఫేస్టోలో ప్రకటించినట్టు తెలిపారు. దానితోపాటు నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నిజాంసాగర్ మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు తెచ్చి మిరుణం తీర్చుకుంటానాని అన్నారు. దీంతో ఈ చుట్టుపక్కల గ్రామాల రైతులు సంవత్సరంలో మూడు పంటలు పండించుకోవచ్చని ఆయన అన్నారు. ఆయా గ్రామాలలో స్థానిక సర్పంచులు కార్యకర్తల సహకారంతో గ్రామ గ్రామాలకు ఇప్పటి వరకు చేసినటువంటి అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఏవైతే మిగిలిన పనులు ఉన్నాయో వాటిని పూర్తిస్థాయిలో అధికారంలోకి రాగానే పూర్తిచేసి గ్రామ ప్రజలకు ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందించనున్నట్టు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఆయా గ్రామాలలో మహిళలు ఎమ్మెల్యే షిండేకు మంగళ హారతులతో స్వాగతం పలికారు. మండల కేంద్రంలో ప్రజలు షిండేను డాన్స్ చేస్తూ స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని ప్రధాన విధుల గుండా తిరుగుతు అభివాదం చేస్తూ ఎన్నికల ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ ధపెదర్ రాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల దుర్గారెడ్డి, కార్యకర్తలు, వివిధ గ్రామ సర్పంచులు ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌షిండే

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక


బీఆర్ఎస్ పార్టీలో చేరిన పలువురు

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని శివాయిపల్లి గ్రామానికి చెందిన సుమారు 30 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిక్కాజి బల్వంతరావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గంప గోవర్ధన్ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు పెరుగుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విట్టల్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు లింగం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యుఐ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పర్మల్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సర్దార్ నాయక్‌ను ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షునిగా నియమించారు. ఈ సందర్భంగా సర్దార్ నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్ కాంగ్రెస్ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలుతెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ వారి తరుపున పోరాడుతానని సర్దార్ నాయక్ అన్నారు.


ఎన్నికైన సర్దార్ నాయక్

బీఆర్ఎస్ పార్టీలో పలువురు చేరిక


సురేందర్ ఆధ్వర్యంలో పలువురు చేరిక

నవతెలంగాణ-లింగంపేట్

ముఖ్యమంత్రి చేపడుతున్న సంక్షేమ పథకాల వైపే ప్రజల ముగ్గు చూపుతున్నారని తిరిగి ప్రజలు బిఆర్ఎస్ పార్టీకే పట్టం కడతారని ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ అన్నారు. బుధవారం లింగంపేట మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామంలో ఆయా పార్టీల చెందిన పలువురు 200 మందికి పైగా ఎమ్మెల్యే జాజల సురేందర్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిచేరారు. అనంతరం నూతనంగా గ్రామ కమిటీని గ్రామస్తుల కార్యకర్తల సమక్షంలో ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చాకలి రమేష్, ఉపాధ్యక్షులుగా శ్రవణ్‌రెడ్డి, గ్రామ యూత్ అధ్యక్షులుగా సిద్ధు, ఉపాధ్యక్షులు కృష్ణతో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, టిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీడు భూముల సస్యశ్యామలం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లబాద్

బాన్సువాడ నియోజకవర్గం లో వివిధ మండలాల్లో గత ఎన్నో ఏండ్లుగా బీడుగా ఉన్న భూములను సస్యశ్యామలం చేసి రాష్ట్రంలోనే బాన్సువాడ నియోజకవర్గంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసే చేసిన తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కోరారు. బుధవారం నసురుల్లాబాద్ మండలంలోని హాజీపూర్, సంగెం, అంకోల్, అంకోల్ తండా, అంకుల్ క్యాంప్, కంషేట్ పల్లి, నాచుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ గ్రామానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వస్తున్నారని సమాచారంతో గ్రామంలో ప్రజలు బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో స్పీకర్‌కు ప్రజలు నిరాజనం పలికారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంగం హాజీపూర్ బొమ్మన్ దేవ్ పల్లి అంకొల్ తాండ గ్రామ శివారు శివారు భూములు బీడుగా ఉండేవి వర్షం పడితే తప్ప పంటలు సాగు కానివి 1997లో హాజీపూర్ శివారులో అటవీశాఖ పరిధిలో ఉన్న భూములు హాజీపూర్ రిజర్వాయర్ 2 కోట్ల 75 లక్షలతో ఆనాడు నిర్మించినట్టు తెలిపారు. ఆ రిజర్వాయర్ నిర్మాణంతో మూడు మండలాల సాగు భూములకు వేసిన బోర్లకు గ్రౌండ్ వాటర్ పెరిగింది. బీడుగా ఉన్న భూములు నేడు రెండు పంటలు సాగు అవుతున్నాయని ఆయన అన్నారు. ఆనాడు రిజర్వాయర్ కట్టడానికి ఎన్నో కష్టాలు పడ్డానని వివరించారు. రైతుల ను అభివృద్ధి చేయడమే తన లక్ష్యంగా భావించానని ఒక్కసారి ఓటు వేస్తే ఐదు సంవత్సరాలు ప్రజల కొరకు నేను పని చేశానన్నారు. గత కొన్ని ఏళ్లుగా బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. మీరు ఒక్క ఓటు వేస్తే నేను ఐదు సంవత్సరాలు మీకు కూలి పని చేస్తున్నానని అన్నారు.

వివిధ ప్రాంతాల నుంచి బిజెపి కాంగ్రెస్ నాయకులు వస్తే వారి మాటలు నమ్మవద్దని సూచించారు. పదవుల కోసం ఏదైనా చెప్పి పబ్బం గడుపుకోవడం కోసం ఎన్నైనా అబద్ధాలు మాట్లాడతారని ఆయన అన్నారు. అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకుంటారో మాటలు చెప్పే నాయకుని ఎన్నుకుంటారో మీరే ఆలోచించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్ ఎంపీపీ పాల్యా విఠల్, జిల్లా కో ఆప్షన్ నెంబర్ మజీద్, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి మాజీ జెడ్పిటిసి కిషోర్ యాదవ్, సర్పంచులు అరిగే హన్మండ్లు, పాల్యా లక్ష్మి, బద్య నాయక్, సాయిలు, రాము మంగలి విజయ సాయిలు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బీఆర్ఎస్‌కు రాజీనామా


కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని ఏనాబోరా గ్రామానికి చెందిన బిఆర్ ఎస్ పార్టీ రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షులు ఎండి షబ్బీర్ పటేల్ బుధవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దృష్టికి ఏదీ తీసుకువెళ్లిన పట్టించుకోవడంలేదని మైనారిటీలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని ఆలోచనతో బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఈనెల 10వ తారీఖున కాంగ్రెస్ పార్టీ జుక్కల్ అభ్యర్థి తోట లక్ష్మీకాంత్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. తనతో పాటు చాలా మంది బీఆర్ఎస్‌లో రాజీనామా చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు పాషాబాయ్, జావీద్ పటేల్, కమల్ సెట్, మాజీ జెడ్పిటిసి సాహెబ్ రావు, చౌలవార్ హనుమాన్లు స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ నాయకుల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ అధ్యక్షులు

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని సోమార్‌పేట గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు బుధవారం మేనిఫెస్టో వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి కెసిఆర్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు షేక్ అజీజ్ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మాచారెడ్డి మండల ఎస్సీ సెల్ ప్రచార కార్యదర్శి దేవయ్య మైనార్టీ అధ్యక్షులు షేక్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యంకొనాలి

- వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-మాచారెడ్డి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సిబ్బందికి సూచించారు. పాల్వంచ మండలంలోని భవానీపేట గ్రామంలో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలు ఉంటే స్థానిక ఏఈఓ ఏవో మాచారెడ్డి సీఈఓకు తెలుపాలన్నారు. వర్షాలు పడే సూచన ఉండటం వలన రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నామినేషన్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలం నుండి మదన్ మోహన్‌కు మద్దతుగా నామినేషన్‌కు బుధవారం బారిగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు బస్సులలో బయలుదేరారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా ప్రతి గ్రామం సర్వీస్ బస్సులలో బారిగా మద్దతుగా బయలుదేరారు.


నామినేషన్‌కు తరలిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

మౌలాలి తండాలో గడపగడపకు ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని మౌలాలి తండా గ్రామ సర్పంచ్ జాదవ్ సునీత బాబు నాయక్ ఆధ్వర్యంలో గ్రామాలలో గడపగడపలకు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ షకీల్ ఆమిర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

జనసమీకరణకు పాట్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నికల ప్రచారం ఊపందుకుంటున్న వేళ.. జన సమీకరణ చిక్కులు తెప్పిస్తున్నాయి. ఆయా డివిజన్‌లలోని ముఖ్య నాయకులకు ప్రచారంలో పాల్గొనేందుకు జన సమీకరణ చేపట్టాలని బాధ్యతలు అప్పగించారు. దీంతో దగ్గరుండి చూసుకుంటూ ప్రజలను ప్రచారంలోకి తీసుకొచ్చేందుకు తంటాలు పడుతున్నారు. ప్రచారం ప్రారంభం నుంచి అది పూర్తయ్యే వరకు ఉన్న వారికే డబ్బులు చెల్లిస్తున్నారు. దీనికోసం ప్రచారానికి వచ్చే వారి పేర్లను ఒక్కొక్కరివి రాసుకుంటున్నారు. దాని తర్వాత వారు వెళ్లి వచ్చే కార్యక్రమం పూర్తి అయిన తర్వాత, వచ్చిన జనాలకు డబ్బులను పంపిణీ చేయడానికి ముందుగా ఎవరు వస్తున్నారో వారి పేర్లను రాసుకుంటున్నారు. నిజామాబాద్ నగరంలోని ఓ ప్రధాన కూడలి వద్ద ఒకరు ఇద్దరు కలిసి ఒక పార్టీ కార్యక్రమానికి జన సమీకరణ చేసి ఎవరెవరు ఈ కార్యక్రమానికి వస్తున్నారో వారి పేర్లను రాసుకుంటున్నారు.



ప్రచారాలకు వెళ్లే వారి పేర్లు నమోదు చేసుకుంటున్న నాయకుడు

ఆకాశంలో మబ్బులు..
రైతు గుండెల్లో గుబులు

నవతెలంగాణ-రామారెడ్డి/జుక్కల్

ఆరుకాలం కష్టించి, చేతికొచ్చిన పంటను కోసి అమ్ముకుందామన్న, రైతుపై ప్రకృతి పగబడుతుంది. వరి పంట చేతికి రావడంతో జిల్లాలు రైతులు వరి కోతలు ప్రారంభించారు. కొందరు పంట కోసి కల్లాలకు తరలించగా, మరికొందరు పంట కోయడానికి సిద్ధమవుతున్నారు. ఇలాంటి కీలక సమయంలో ఆకాశం మబ్బుపట్టి ఉండటంతో రైతుల గుండెల్లో గుబులు పుడుతుంది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు పడుతుండడంతో ధాన్యం తడుస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 2,20,109 మంది రైతులు, 3,17,084.38 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. జిల్లావ్యాప్తంగా వర్షాకాలం సీజన్లో 7,92,711 మెట్రిక్ టన్నుల వారి ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు వరి ధాన్యం ఆరబెట్టడానికి స్థలం సరిపోకపోవడం, మరి కొన్ని ప్రాంతాల్లో స్థలమే లేకపోవడంతో ప్రధాన రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దవుతుందని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడవకుండా, తాటి పత్రాలు ఏర్పాటు



రామారెడ్డిలో ధాన్యం లోడ్ చేస్తున్న కూలీలు



జుక్కల్‌లో...

చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వరి ధాన్యాన్ని వెంటనే తూకం వేసి తరలించాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు.

జుక్కల్: మండలంలో కురిసిన అకాల వర్షంతో పంటలకు నష్టం చేకూరింది. కొన్ని పంటలకు లాభం చేసినా, మరికొన్ని పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు అందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో విత్తుకున్న పత్తి, రబిలో వేసిన పెద్ద జొన్న ఇతర పంటలు లాభం చేకురినా, కంది పంటకు భారీగా నష్టం జరుగుతుందని రైతులు అంటున్నారు. చలికాలం ఉన్నందున పొగమంచు కురుస్తుంది. కందిపంట పూత దశలో ఉండగా.. నష్టం వాటిల్లే అవకాశం ఉంది. చీడపీడల బెడద ఉండే అవకాశం ఉంది.

జుక్కల్ స్కూల్‌లో నీటిఎద్దడి తీర్చండి

- ఎంఈవోకు ఎస్ఎఫ్ఐ వినతి

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గత కొన్ని రోజులుగా తాగునీరు లేక, తిన్న ప్లేట్లు కడుక్కోవడానికి నీళ్ల రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. నీళ్ల లేక జీపి నల్లాల వద్దకు వెళ్లనున్నట్టు తెలిపారు. సమస్య చాలా రోజులుగా పరిష్కరించకపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం ప్లేట్లు పట్టుకుని బయటికి వెళ్లడం అవనమానంగా విద్యార్థులు భావిస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరుతు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం జుక్కల్ ఎంఈవో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి డిమాండ్‌తో కూడిన వినతి పత్రం అందించారు. నీటి సమస్య తీర్చని ఎడల ఉద్యమం చేస్తానని ఎస్ఎఫ్ఐ మండల శాఖ అధ్యక్షుడు అఫ్రోజ్ వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు షేక్ ఫిర్దోస్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ

ఎల్లారెడ్డికి తరలిన నాయకులు

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో ఎల్లారెడ్డికి తరలి వెళ్లారు. ఎల్లారెడ్డిలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్మోహన్ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించబోతుందని తెలిపారు.

కేసీఆర్ నామినేషన్ దాఖలుకు తరలిరావాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు గురువారం నామినేషన్ దాఖలు కార్యక్రమానికి, మండలం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిరుమలరెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేస్తున్నందున నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయని, ప్రజలు విషయాన్ని గ్రహించి, ప్రతిపక్షా పార్టీల మాటలను నమ్మవద్దని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ కామారెడ్డి నుండి పారిపోయారని, కాంగ్రెస్ పార్టీ ముందుగానే తమ ఓటమిని అంగీకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి, సొసైటీ చైర్మన్లు భూమి రెడ్డి, భూమయ్య, మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ అందే మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం హాజరు నమోదయ్యేలా కృషి చేయాలి

నవతెలంగాణ-పిట్లం

విద్యార్థుల హాజరు ప్రతిరోజు వంద శాతం నమోదయ్యేలా కృషి చేయాలని రాంపూర్ కాంప్లెక్స్ ఉపాధ్యాయురాలు శ్రీలత సూచించారు. బుధవారము మండలంలోని రాంపూర్ కాంప్లెక్స్ పరిధిలోని మద్దెల్ చెరువు, బొల్లక్ పల్లి, బండాపల్లి, పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ.. ఆయా పాఠశాలల ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నైజేషన్) యాప్ ఎంతమంది రిజిస్ట్రేషన్ అయ్యారు, ఎంతమంది పిల్లలను ప్రతిరోజు ద్వారా హాజరు నమోదు చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. యూడైస్‌లో ఎంతమంది పిల్లలు ఉన్నారు, పాఠశాలలో నమోదైన పిల్లల సంఖ్య సమానంగా ఉండే విధంగా చూసుకోవాలని చించారు. ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎస్ఏ1 మార్కులు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జ్యోతిలక్ష్మి, రమేష్, బాల్ సింగ్, సిబ్బంది సుకన్య, గోపాల్, సాయిలు, జ్యోతి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్, గోపాల్, ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి పలువురి చేరిక

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలంలోని నందివాడ, దేమి కలాన్, సంగోజువాడి, కన్కల్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ,బిజెపిలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో 150 మంది కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కౌడి రవి, బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయి రెడ్డి, డి సి ఎం ఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్ రెడ్డి ,వైస్ ఎంపీపీ నర్సింలు నాయకులు సంజీవులు గోపాలరావు పాల్గొన్నారు.

కన్నతల్లి లాంటి కాంగ్రెస్‌పార్టీ వీడను

- మాజీ ఎమ్మెల్యే గంగారం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

తనకు పార్టీ టికెట్ కేటాయించకున్నా కాంగ్రెస్ పార్టీ తన కన్నతల్లి లాంటిదని, పార్టీని వీడే ప్రసక్తే లేదని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారం అన్నారు. చేతిగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదగర్ గంగారాం తన స్వగృహంలో జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని తన అనుచరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభిప్రాయాల మేరకే తన నిర్ణయం ఉంటుందని, కాంగ్రెస్ పార్టీని వీడనని వెల్లడించారు. రేపు మద్నూర్ లో రెండు సెట్ల నామినేషన్ లను వేస్తానని పార్టీ కార్యకర్తలు అభిమానులు దాదాపు ఐదు వేల మంది భారీ సంఖ్యలో కార్యకర్తలు కదిలి రావాలంటూ పిలుపునిచ్చారు. ఒకటి కాంగ్రెస్ రెబల్‌గా, మరొకటి ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేస్తానంటూ కార్యకర్తలకు వెల్లడించారు. జుక్కల్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకుల సూచనల మేరకు నడుచుకుంటాననితెలిపారు.

కొందరు నాయకులు ఢిల్లీలో, ముంబాయ్‌లో ఉంటారని, కానీ తాను మాత్రం జుక్కల్ ప్రజల సేవ కోసం పెద్దకొడప్‌గల్‌లోనే ఉంటానని అన్నారు. జుక్కల్ ప్రజలే నాకు ఢిల్లీ అని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తలు చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగారం

సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తేది:15-11-2023 నాడు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో జరగబోయే ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ భహిరంగ సభా ప్రాంగణాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జనార్ధన్ గౌడ్, మునిసిపల్ చైర్మన్ సత్యనారాయణ, జడ్పీటీసీ ఉషా గౌడ్, మనోహర్ రెడ్డి, పార్టీ మండల జలంధర్ రెడ్డి, కృష్ణ గౌడ్, బాలరాజ్ గౌడ్, కౌన్సిలర్లు శ్రీనివాస్, ఇమ్రాన్, ముజీబ్, షరీఫ్ భాయ్, రాజు, నీలకంఠం, బి.రాము ఉన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జాజాల సురేందర్

నేడే సీఎం కేసీఆర్ నామినేషన్

- సభాస్థలిని పరిశీలించిన హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గంలో గురువారం సీఎం కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభ స్థలాన్ని హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కామారెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎంజీ వేణుగోపాల్ గౌడ్ తో కలిసి పరిశీలించారు. సాక్షాత్తు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గం నుండి పోటీ చేయడం కామారెడ్డి ప్రజలు చేసుకున్న అదృష్టమని ఆయన అన్నారు. అత్యధిక మెజార్టీ ఇచ్చి కేసీఆర్ ను గెలిపించుకోవాల్సిన బాధ్యత కామారెడ్డి నియోజకవర్గ ప్రజలకు ఉందన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న మాజీ మేయర్

బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలం లోని తిమ్మారెడ్డి తండా, కట్ట కింది తండాలో బుధవారం బిఆర్ఎస్ నాయకులు గడప గడపకు తిరుగుతూ బిఆర్ ఎస్ మేనిఫెస్టోలో ని అంశాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే జాజల సురేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ , జడ్పీటీసీ ఉష గౌడ్,బి ఆర్ ఎస్ నాయకులు పద్మారావు,రఘువీర్ గౌడ్, అరవింద్ గౌడ్,గంగా రెడ్డి, వసంతం,అబ్దుల్ అలీ పాషా,రవీందర్ గౌడ్, బబ్లు,నాగం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా మాజీ అధ్యక్షురాలు బిక్కనూర్, రాజంపేట ఉమ్మడి జిల్లాల ఎన్నికల ఇంచార్జ్ శారద పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. బుధవారం ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి అరాచక పాలనను ప్రతి ఒక్కరికి వివరించాలని, కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 6 గ్యారంటీలను ప్రతి ఒక్కరికి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమ్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్ రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, రాజంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాదవ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంకం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.